ఓటరు నమోదుకు సహకరించండి

వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, అక్టోబర్ 23: ఓటు హక్కు పొందడం బాధ్యతగా గుర్తించి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా 18 సంవత్సరాలు పైబడిన వారు తప్పకు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు గాను ఓటరు జాబితాను సవరించుకునే విధంగా ఆయా పార్టీల నాయకులు తోడ్పడాలని తెలిపారు. వారి వారి పరిధిలోని వార్డుల్లో అవగాహన కల్పించి ఓటరు జాబితాలో సవరణలు, తీసివేతలు, మార్పులు చేర్పులు, కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడం, అడ్రస్ మార్పు వంటి వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు రమేశ్‌బాబు, కృష్ణంరాజు, ఎస్బీ గుల్షన్, చంద్రప్ప, ఆసీఫ్‌ఖాన్, బుస్స చంద్రయ్యలతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ఉత్సవాలు

కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

పరిగి, అక్టోబర్ 23 : పరిగి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయ మూడవ వార్షిక ఉత్సవాలలో భాగంగా బుధవారం హోమం, మూల ఉత్సవ మూర్తులకు అభిషేకం, ద్వారతోరణ పూజలు, మూల మంత్ర పారాయణం, నివేదన తదితర కార్యక్రమాలు జరిగాయి. యాదాద్రి ఆలయ విశ్రాంత ప్రధానార్చకులు కారంపూడి నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో, సిద్ధాంతి పార్థసారథి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ధర్మకర్తలు ఎదిరె కృష్ణ–పద్మ, నరేందర్–జయశ్రీలు పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, 11.30 గంటలకు శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణ సమితి ర్యాలీ

కొడంగల్, అక్టోబర్ 23: హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా హిందూ సంస్కృతిని నాశనం చేయాలనే దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ..సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శివాజీ చౌక్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవతల విగ్రహాల ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తూ. హిందూ సంస్కృతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారా యణకు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో కూర వెంకటయ్య, కొట్రికే లక్ష్మీనా రాయణ, పవన్‌లాహోటీ, రవీందర్‌నాయక్., నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో 'శ్రమదానం'

కార్యాలయంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది, అధికారులు

బంట్వారం, అక్టోబర్ 23 : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు తమ సిబ్బందితో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నో యేండ్లుగా పేరుకు పోయిన చెత్త, చిత్తు కాగితాలను 'స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా శుభ్రం చేశారు. ప్రధానంగా మం డల పరిషత్ కార్యాలయంలో వివిధ ఎన్నికల సమయంలో పేరుకుపోయిన చెత్త కాగితాలను అలాగే ఉంచారు. ప్రస్తుతం వాటి కాల పరిమితి తీరిపోవడంతో తొలగించినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. అలాగే కార్యాలయ పరిసరాల్లో చెట్ల వ్యర్థాలు, ఇతరాత్రా చెత్తను తొల గించారు. ఇందుకు ఆయా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లతో పాటు ఎంపీపీవో నాగరాజ్ చెత్త తొలగింపు పనుల్లో పాల్గొన్నారు.

పొలం పనులకు వెళ్లిన వ్యకి అదృశ్యం: కేసు నమోదు

బంట్వారం(కోట్‌పల్లి), అక్టోబర్ 23 : పొలం పనులకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్ఐ స్రవంతి కథనం మేరకు మండల పరిధిలోని మద్గుల్ తండాకు చెందిన నేనావత్ చాప్లా నాయక్ (60) 17 వతేదీన ఇంటి నుంచి ఎడ్లను తీసుకుని పొలానికి వెళ్లాడు. అటు నుంచే తన కూతురు ఉన్న కంకణాళపల్లి తండాకు వెళ్తానని చెప్పాడు. అయితే అక్కడికి వెళ్లక పోగా , ఇక్కడా తన ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఎలాంటి సమాచారం దొరకలేదని, దీంతో కొడుకు నేనావత్ రవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కులకచర్ల, అక్టోబర్ 23 : చౌడాపూర్ మండల పరిధిలోని వాల్యనాయక్‌తండాలో బుధవారం గోర్‌సిక్విడ్ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సమాజంలో కొత్తతరం వారికి సేవాలాల్ మహారాజ్, బంజార సమాజం కృషి గురించి వివరించారు. ఈ సందర్భంగా హాతీ రాంబాపు తదితర నాయకుల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోబ్రియానాయక్, శంకర్‌నాయక్, ఎంపీటీసీ గాంగ్యానాయక్, బావోజీ రాంచందర్, తండా పెద్దలు మోతీలాల్, సింధు, రెడ్యా, రాంచందర్, పాండు, యువజన సంఘం నాయకులు హన్మంత్, బల్సింగ్, గోని తదితరులు పాల్గొన్నారు

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, అక్టోబర్ 23: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మైల్వార్ గ్రామంలో రూ. మూడులక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు డీఎంఎఫ్‌టీ నిధులను కేటాయిస్తామన్నారు. కోత్లాపూర్ గ్రామం నుంచి మైల్వార్ గ్రామం వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అక్కలమ్మ చెరువు మరమ్మతులకు నిధులు ఇస్తామన్నారు. రైతులు వడ్లను ఆరబెట్టేందుకు ప్రభుత్వ స్థలాలను వాడుకోవాలని సూచించారు. స్థలాలను గుర్తించి చదును చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వానకాలానికి సంబంధించిన వడ్ల కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తామని, ఈసారి సన్న రకం వడ్లకు ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, చందర్, నాయకులు రోహిత్ మహారాజ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామునాయక్, ఖలీద్, బిచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు నర్సింహులుగౌడ్, శ్రవణ్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యని

కార్యకర్తల కృషి ఫలితమే ఈ అధికారం

యాలాల, అక్టోబర్ 23: ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పని చేసి పార్టీని విజయ తీరాలకు చేర్చారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. పార్టీ విజయం కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. గ్రామ గ్రామాన సంక్షేమ ఫలాలను ఇందిరమ్మ కమిటీల ద్వారా అందిస్తామన్నారు. నేడు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.230 కోట్లను రహదారుల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు భీమప్ప, అమృతప్ప, హన్మంతు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బషీరాబాద్, అక్టోబర్ 23: ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. బుధవారం నగరంలోని తన నివాసంలో మంతట్టి గ్రామానికి చెందిన బాధితుడు పి. చంద్రారెడ్డి చెందిన రూ. 56000 వేల చెక్కును గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి ద్వారా అందజేశారు.

యాలాల,అక్టోబర్ 23: ఎస్ఎఫ్ఏ సంస్థ మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలీ స్టేడియంలో నిర్వహించిన చాంపియన్‌యషిప్ 24 అండర్ 14 రూబిక్స్ క్యూబ్ రాష్ట్రస్థాయి పోటీల్లో తాండూరు పట్టణం శ్రీ నేతాజీ గురుదేవ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కందుకూరి చైత్ర 41 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. బుధవారం పాఠశాల యాజమాన్యం చైత్రను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బ్యాంక్‌సేవలు, సౌకర్యాలపై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

కొడంగల్, అక్టోబర్ 23: మండలంలోని చిట్లపల్లి గ్రామంలో నాబార్డ్ సౌజన్యంతో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా నాబార్డ్ డీపీఎం అఖిల్, ఏపీజీవీబీ రీజినల్ కార్యాలయ ఎస్ఎం ఆపరేషన్ రంగస్వామి పాల్గొని బ్యాంకు సేవలు, సౌకర్యాల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకులో పొదుపు, డిపాజిట్‌లు వంటి వాటిని అలవరచుకోవాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లించడం వల్ల పొందే లాభాలను వివరించారు. మోసపూరితమైన ఫోన్ కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలని, కాల్స్ వల్ల డబ్బులు పోగొట్టుకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన కింద సంవత్సరానికి రు.1000 లు చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 20లక్షలు బీమా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ సురేశ్‌రెడ్డి, బ్రాంచి మేనేజర్ కిరణకుమార్, ఫీల్డ్ ఆఫీసర్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మాలు కొడితే చర్యలు తప్పవు

కులకచర్ల, అక్టోబర్ 23 : కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య వైద్యాధికారి డాక్టర్ వాజిహుద్దీన్‌ను హెచ్చరించారు. బుధవారం కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆస్పత్రికి వైద్యులు సక్రమంగా వస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. వైద్యాధికారి వారంలో ఒకటి లేదా రెండు రోజులు వస్తున్నాడని తెలుసుకున్న వారు పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించడం అదృష్టమని ,అటువంటి పవిత్రమైన దేవునిలాంటి వృత్తిలో ఉండి పేద ప్రజలకు వైద్యం అందించాల్సి ఉండగా వైద్యసిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పర్యవేక్షించాల్సి ఉండగా వైద్య ధికారే విధులకు డుమ్మాలు కొట్టడంతో ప్రభుత్వ వైద్య వ్యవస్థ దెబ్బతిం టుందని అన్నారు. వారంలో ఒకటి లేదా రెండు రోజులు ఎందుకు వస్తున్నారని... ప్రతి రోజూ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇష్టం లేకుంటే ట్రాన్స్ ఫర్ పెట్టుకోవాలని, తమ ఎమ్మెల్యే ద్వారా మరొక వైద్యాధికారిని కేటాయించుకుంటామని అన్నారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. దీనికి గాను వైద్యుడు స్పందిస్తూ సక్రమంగా విధులకు హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యాధికారి వాజిహుద్దీన్‌ను ప్రశ్నిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

మూడు ఇండ్లల్లో చోరీ

- ఒక ఇంట్లో నాలుగు తులాల బంగారం, పదహారు తులాల వెండి అపహరణ
- మరో ఇంట్లో రూ. 40వేలు, ఒక సెల్ ఫోన్..
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తాండూరు డీఎస్పీ, సీఐ

బషీరాబాద్, అక్టోబర్ 23 : మండల పరిధిలోని పర్వానాయక్‌తండాలో దొంగలు మూడు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తాండూరు డీఎస్పీ, సీఐ తండాను సందర్శించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై గఫార్ బుధవారం వివరించారు. తండాకు చెందిన చవాన్ పాండు మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కూతురును చూసేందుకు వికారాబాద్ వెళ్లారు. అయితే బుధవారం చవాన్ ఇంటి తాళం పగలగొట్టి ఉండటం గమనించిన తండా వాసులు ఫోన్ చేయడంతో చవాన్ ఇంటికి వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారం, 16 తులాల వెండి పట్టీలు దొంగలించబడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అదేతండాకు చెందిన చవాన్ గోపాల్ మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఒక గదిలో పడుకుని ఉన్నాడు. బుధవారం ఉదయం లేచి బయటకు వెళ్దామని డోర్ తీసేందుకు ప్రయత్నించగా, డోర్ బయట నుంచి గొల్లెం పెట్టి ఉండటం గమనించి ఇంటిప్రక్కన ఉన్న మారుణి బాయికి ఫోన్ చేయగా గొల్లెం తీసింది. దీంతో బయటికి వచ్చి చూడగా మరో గది తాళం విరగ్గొట్టి ఉన్నది. వెంటనే రూమ్ లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం విరగ్గొట్టి ఉంది. అందులో పెట్టిన రూ. 40 వేలు కనిపించక పోవడంతో ఇంటి పక్కన వాళ్లకు విషయం చెప్పగా, తన సెల్ ఫోన్ కనిపించడం లేదని చవాన్ రాందాస్ తెలిపాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు తండాకు వెళ్లి ప్రాథమిక విచారణ జరిపి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం అందించారు. డీఎస్పీ, సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైని అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

నల్లా బిల్లులపై స్పెషల్ డ్రైవ్

వికారాబాద్, అక్టోబర్ 23 : పట్టణ ప్రజలు ఇంటి బిల్లులు, నల్లా బిల్లులను వెంటనే చెల్లించాలని వికారాబాద్ ఇన్‌చార్జి కమిషనర్ రాకేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడలో బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరిగి బిల్లులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులు, ఇంటి పన్నులను వెంటనే చెల్లించాలన్నారు. నల్లా బిల్లులు ఆన్‌లైన్‌లో చూపడం లేదని, బిల్లులు కట్టినట్లు రశీదులు ఉంటే చూపాలని సూచించారు. ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు అరుణ్, అశోక్, సాయి ఉన్నారు.

వంద మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు

కులకచర్ల, అక్టోబర్ 23: కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ డాక్టర్ శ్రీనివాస్, ఆసరా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ రవికుమార్ సహకారంతో క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 100 మందికి టెస్టులు చేసి 30 మందికి ఆపరేషన్లు అవసరమున్న వారికి హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంఎన్‌జే వైద్యులు, ఆసరా రైరల్ డెవలప్ మెంట్ సిబ్బంది, కులకచర్ల వైద్యాధికారి డాక్టర్ వాజిహుద్దీన్, డాక్టర్ మాధురి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యే రాక

కులకచర్ల, అక్టోబర్ 23 : మండల పరిధి లోని అల్మాస్‌ఖాన్ పేట్‌లో ఉన్న భూముల వివరాలను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిధిలోని అల్మాస్‌ఖాన్ పేట్‌లోని భూములను, మధ్యాహ్నం 2గంటలకు చౌడాపూర్ మండల పరిధిలోని మక్తవెంకటాపూర్ గ్రామ భూములను పరిశీలించనున్నట్లు తెలిపారు. పైన తెలిపిన గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరం కట్టడి..తిరిగి నగదు అందజేత

కొడంగల్, అక్టోబర్ 23 : బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేయగా, పోలీసులకు ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లో తిరిగి నగదు ఇప్పించిన ఘటన కొడంగల్‌లో జరిగింది. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారా యణ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఫర్హీనాబేగం బ్యాంకు ఖాతా నుంచి గత జూన్ 19న రూ.90వేలు ఇతరుల ఖాతాలోకి జమయ్యాయి. దీంతో ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలుపగా, వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఖాతా హోల్డ్‌లో పెట్టారు. సైబర్ నేరానికి పాల్పడిన నెలరోజుల్లోపే కోర్టు ప్రాసెస్ ప్రకారం... మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు బుధవారం రూ.90వేలు తిరిగి ఇప్పించామని పేర్కొన్నారు. పట్టణ, గ్రామ ప్రజలు ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 12గంటల్లోపు 1930 నంబర్‌కు డయల్ చేసి తెలియజేసిన తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఏటీఎం, ఖాతా వివరాలను బ్యాంకు కోరదని, ఎటువంటి ఫోన్‌లు వచ్చినా తెలుపవద్దని సూచించారు.

పాఠశాల ప్రహరీకి నిధులు మంజూరు చేయాలి



ధారూరు, అక్టోబర్ 23: మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలకు ప్రహరీ మంజూరు చేయాలని ఎంఐఎం మండల అధ్యక్షుడు మోహిజ్‌ఖురేషీ విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ కలిసి మండల కేంద్రం లోని ఉర్దూ మీడియం పాఠశాల, ఈద్గాలకు ప్రహరీ నిర్మాణల కోసం నిధులు కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు స్పీకర్ స్పందిస్తూ త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

షీటీం, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు/ తాండూరు రూరల్ అక్టోబర్ 23: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం తాండూరు పట్టణ సమీపంలోని మహాత్మా జ్యోతీబా పూలే పాఠశాల, కళాశాలలో షీటీమ్‌లపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. విద్యార్థినుల రక్షణ కోసమే షీటీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా ఆపద ఉంటే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సాధారణంగా ప్రజలు అత్యాశ వల్ల సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు సమాజంలో ఎన్నో రకాలుగా అమాయక ప్రజల నగదును దోచుకుంటున్నారన్నారు. రోజురోజుకూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయే వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. మహిళలను ఎరచూపి వీడియో కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారన్నారు. ఇలాంటి వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మధ్య కాలంలో పిల్లలు, యువత ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోన్లు తీసుకొని ఆ డబ్బులతో రమ్మీ గేమ్, ఇతర ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ మోసపోతూ ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు మోసపోకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారి ప్రవర్తన మరియు మొబైల్ వినియోగంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరగాని చేతిలో మోసపోయిన వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా https/cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కోరారు.

మిషన్ భగీరథ నీటిని మాత్రమే తాగాలి

దౌల్తాబాద్,అక్టోబర్ 23: మిషన్ భగీరథ నీటిని మాత్రమే తాగాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోపంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ప్రతిగ్రామంలో పంచాయతీ కార్యదర్శి మిషన్ భగీరథ నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగితే ఇంకా మంచిదన్నారు. తాగునీటి ఇబ్బం దులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టిపెట్టాలని సూచించారు. ఏ గ్రామంలో తాగు నీటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీమతి పద్మ భేమమ్మ భర్త పెంటయ్య, వయస్సు : 51 సం॥లు, నివాసము ఇం.నం.2-44/A, గ్రామము చౌదరిగూడ, జల్లేడ్ చౌదరిగూడ మండలము, రంగారెడ్డి జిల్లా. తెలంగాణ వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ షాద్‌నగర్ బ్రాంచి వారు లోన్ ఇవ్వడానికి నిశ్చయించినారు, కావున ఇట్టి యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్రదించగలరు, లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎటువంటి వివాదాలు లేనిదిగా పరిగణించి మా క్లయింటు ముందుకు కొనసాగుతారు.
షెడ్యూల్ ప్రాపర్టి - 1 :- గ్రామము చౌదరిగూడ, జల్లేడు చౌదరిగూడ, రంగారెడ్డి జిల్లా, చౌదరిగూడ గ్రామములో గృహం నెం.1-88, 62 చ.గజముల సమానమగు 51.84 చ.మీటర్లు గృహము కలదు.
హద్దులు : - తూర్పు : వడ్డె యాదమ్మ ఇల్లు. **పడమర:** గ్రామ పంచాయతి సిసి రోడ్డు. **ఉత్తరం:** వడ్డె పెంటయ్య ఇల్లు. **దక్షిణం:** వడ్డె లక్ష్మయ్య ఇల్లు.
షెడ్యూల్ ప్రాపర్టి - 2 :- గ్రామము చౌదరిగూడ, జల్లేడు చౌదరిగూడ, రంగారెడ్డి జిల్లా, చౌదరిగూడ గ్రామములో గృహం నెం.1-89, వైశాల్యము